విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 27, సెప్టెంబర్ 2024

/// సంక్షిప్త సమాచారం ///

స్వర్ణ భూమి ఎరువుల కర్మాగారం తనిఖీ

విశాలాంధ్ర–శింగనమల: మండల పరిధిలోని బండమీద పల్లి సమీపాన వెలసిన స్వర్ణ భూమి ఫెర్టిలైజర్ ఆర్గానిక్ ఎరువుల తయారీ కర్మాగారాన్ని గుత్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.వెంకట రాముడు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, గోడౌన్ స్టాక్, లాబొరేటరీని పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకూడదని, స్టాకుని రిజిస్టర్‌లో కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్, కర్మాగార యాజమాన్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగాపే ఆశ్రమాన్ని దర్శించిన సీఐ

విశాలాంధ్ర–యాడికి: మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో యాడికిలో నూతనంగా విధులు నిర్వహిస్తున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.ఈరన్న గురువారం అగాపే ఆశ్రమాన్ని సం దర్శించి ఆశ్రమంలో ఉన్న వారందరికీ బెడ్ షీట్లు, బ్రెడ్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశులు, హెడ్ కానిస్టేబుల్, పోలీస్ కానిస్టేబుల్, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, టిడిపి నాయకులు దేరంగుల నాగశేఖర్, లక్ష్మణ్, విశ్వనాథ్,రామకృష్ణ, నరసింహులు, నారాయణస్వామి, బద్దెల రాముడు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ దీక్షకు మద్దతుగా సంఘీభావం

విశాలాంధ్ర–ఉరవకొండ: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారనే వార్తల నడుమ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా శుక్రవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జనసేన పార్టీ నాయకులు సంఘీభావ దీక్షలు నిర్వహించారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఐక్యంగా కదులుదామంటూ జనసేన నాయకులు పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ఉరవకొండ ఇన్చార్జి గౌతం కుమార్, ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు చంద్రశేఖర్, కేశవ, మణికంఠ, నీలకంఠ, అనిల్ పాల్గొన్నారు.

కంప చెట్లు తొలగించి ప్రమాదాలు నివారించండి

విశాలాంధ్ర–శింగనమల: శింగనమల నుండి రాచేపల్లి, తరిమెళ్ల, కల్లుమడి, కల్లూరు వరకు రోడ్డుకి ఇరువైపులా కంప చెట్లు పెరిగిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయనివాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలుపు దగ్గర ఎదురుగా వస్తున్న వాహనం కనపడకుండా కంప చెట్లు ఏపుగా పెరిగాయని, అందువల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రమాదాల వల్ల అనేకమంది ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికే ప్రమాదాలు జరిగి అనేకమంది ఆసుపత్రుల పాలయ్యారని, ఇప్పటికైనా అధికారుల స్పందించి రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మల్టీ లెవెల్ పార్కింగ్‌లకు చర్యలు

విశాలాంధ్ర–అనంతపురం: నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నగరంలోని టవర్ క్లాక్ వద్దనున్న బ్రిడ్జి కింద పార్కింగ్ స్థలాన్ని, పాత ఊరులోని తాడిపత్రి బస్టాండ్ సర్కిల్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ లను ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇందుకోసం స్థలాలను గుర్తించాలన్నారు. అంతకుముందు నగరంలోని కోర్ట్ రోడ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కార్యాలయం కాంపౌండ్‌లో ఉన్న నాలా ట్రాక్టర్ ట్రాలీని, జెసిబిలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ నాగరాజు, ఈఈ సూర్యనారాయణ, డిఈ సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా హజ్రత్ సయ్యద్ వలీ బాషా ఖాద్రి ఉత్సవాలు

విశాలాంధ్ర–గుత్తి: ప్రాచీన కోట వీధిలో కొండపై వెలసిన హజ్రత్ సయ్యద్ వలి భాషా ఖాద్రీ రహంతుల్లా అలైహి 677వ ఉరుసు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఉరుసు ఉత్సవాలు జియారత్ మూడో రోజులో భాగంగా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు, గుత్తి మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ, తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ దర్గాలో స్వామివారిని దర్శించుకుని చక్కర చదివింపులు చేశారు. దర్గా కమిటీ అధ్యక్షుడు కేఎస్ ఉమర్, తనయుడు కేఎస్ మైనుద్దీన్, కెఎస్ అజాజ్, కేఎస్ మహబూబ్ బాష, కెఎస్ కరీం, కెఎస్ ఇర్ఫాన్, దర్గా కమిటీ సభ్యులు ఎల్ బాష, షఫీ, సమీర్, మునీర్, ఆరిఫ్, జాఫర్, షాహిద్, బాబా తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పాటిద్దాం - ఆరోగ్యాన్ని రక్షించుకుందాం

విశాలాంధ్ర – జేఎన్టీయూఏ: స్వచ్ఛత పాటిద్దాం–ఆరోగ్యాన్ని రక్షించుకుందామని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మూర్తి అన్నారు. గురువారం కళాశాలలో స్వచ్ఛత హై కార్యక్రమాన్ని మానవహారంగా నిర్వహించి చేపట్టారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిరంతరం వివిధ రుగ్మతలతో అనారోగ్య భారాన పడకుండా నిరంతరం పరిసర ప్రాంతాలలో అపరిశుభ్రతను నివారిస్తూ కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి పాటుపడదామని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఎం సురేందర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవ దృక్పథంలో అలవర్చుకొని ఉన్నత వ్యక్తిత్వ వికాసం, ఉన్నత ప్రమాణాలను మెరుగుపరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ఎస్ఎస్ అధికారి ఖలీల్ బాష, నవీన్ కుమార్, అధ్యాపక బృందం, పిఆర్ఓ శాంతప్ప, విద్యార్థు పాల్గొన్నారు.

పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నదే ఉద్దేశం

విశాలాంధ్ర–ఉరవకొండ: రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి రమణకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభను సర్పంచ్ లలిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఏ2047 దార్శనికపత్రం తయారీలో ప్రజలందరిని భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో ప్రజలు సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తెలిపేలా రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక క్యూఆర్ కోడ్ రూపొందించిందన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి సమాచారం, క్యూఆర్ కోడ్ సచివాలయ సిబ్బంది అందరికీ అందుబాటులో ఉంటుందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వార్డు సభ్యులు నిరంజన్ గౌడ్, రామాంజనేయులు, వాసు, మలేరియా సబ్ డివిజన్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

విశాలాంధ్ర–ఉరవకొండ: నియోజకవర్గంలో ఓటర్లు జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఉరవకొండ తాహశీల్దార్ మహబూబ్ బాష కోరారు. ఈమేరకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో భాగంగా నియోజకవర్గంలో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు. ఓటర్ లిస్టులో పేర్లు నమోదు, సవరణలు, తొలగింపులకు సంబంధించి క్లెయిమ్స్ వచ్చాయని వాటిని పారదర్శకంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. సిపిఎం నాయకులు మధుసూదన్ నాయుడు, వైసీపీ నాయకులు ఏసి ఎర్రి స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోనియా సీన, సుధాకర్ వీరితోపాటు వివిధ మండలాలకు చెందిన రెవిన్యూ అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో బాల్య వివాహాలు జరక్కుండా ప్రత్యేక దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర–అనంతపురం: జిల్లాలో బాల్య వివాహాలు ఒక్కటీ జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలనిజిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో బాల్య వివాహాల నివారణ, కార్యాచరణ ప్రణాళికపై జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూసు కోవాలని, బాల్య వివాహాలు సున్నా చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో వచ్చే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో దృష్టి పెట్టాలన్నారు. ఇందు కోసం అంకితభావం కలిగిన అధికారులు పని చేయాలన్నారు. ప్రభుత్వం బాల్య వివాహాలపై చట్టంలో కఠినమైన చర్యలు ఉన్నప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయో అధ్యయనం చేయాలని సూచించారు. బాల్య వివాహాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయు ప్రదేశాలలో హడావుడి, హంగామా చేయ కుండా ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలన్నారు. అని స్టెంట్ కలెక్టర్ వినూత్న సిడ బ్ల్యూసీ చైర్ పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసిడిఎస్ పిడి బిఎన్.శ్రీదేవి, డిఎం ఎహెచ్ఓ డా.ఈబి.దేవి, డిఆర్డిఏ పిడి ఓబులమ్మ, డిపిఓ ప్రభాకర్ రావు,డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, డిఇఓ వరలక్ష్మి, డివిఈవో వెంకటరమణ నాయక్‌లు పాల్గొన్నారు.

మండల సమస్యలను పరిష్కరించండి : సీపీఐ

విశాలాంధ్ర–డి.హీరేహాళ్: మండల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్లికేతి గ్రామం సీపీఐ శాఖ కార్యదర్శి నాగిరెడ్డి ఆధ్వర్యంలో శాఖ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి నేటి వరకు నిరంతరం పేదలు, కార్మికులు, రైతులు, రైతు సమస్యల కోసం, కర్షకుల కోసం పనిచేస్తున్న పార్టీ ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. గ్రామాల్లోని నీటి సమస్యలు, రోడ్డు సమస్యలు, గ్రామ పరిశుభ్రత, గ్రామంలోని పింఛన్లు ఇతర సమస్యలపై దృష్టి సారించాలన్నారు. శాఖ కార్యదర్శి ఆ సమస్యపై స్పందించాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తిచూపాలని, ప్రతినెలా ఒకసారి శాఖ సమావేశాలు వేయాలని సూచించారు. పార్టీని బలోపేతం చేసి, నిరంతరం గ్రామ సమస్యల కోసం కృషి చేయాలన్నారు. మండల కార్యదర్శి హనుమంతు, శాఖ కార్యదర్శి నాగిరెడ్డి, రైతు సంఘం నాయకులు తిప్పే స్వామి, సీపీఐ నాయకులు నరసింహులు, బొజ్జన్న, వెంకటేశులు, రామాంజి పాల్గొన్నారు.

జీ తెలుగులో సరిగమప సీజన్ 16

ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ లాంచ్

విశాలాంధ్ర –అనంతపురం: జీ తెలుగు సరిగమప తన సరిగమప సీజన్ –16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ ఈ నెల 29న సాయంత్రం 6 గంటలకు, అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రసారమవుతుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గాయకులకు ప్రోత్సహించే లక్ష్యంతో డ్యాన్సింగ్, సింగింగ్ షోలతో మట్టిలో మాణిక్యాలను జీ తెలుగు గుర్తిస్తుందన్నారు. ఇందులో భాగంగానే విజయ వంతంగా 15 సీజన్లు పూర్తి చేసుకున్న సింగింగ్ షో 'స రి గ మ ప' కొత్త సీజన్ ప్రారంభం కానుంద న్నారు. ఈ సీజన్లో గాయనీ, గాయకులు విలేజ్ వోకల్స్, సిటీ క్లాసిక్స్, మెట్రో మెలోడీస్ అనే మూడు జట్లుగా పోటీ పడతారాన్నారు. ఈ జట్లకు మెంటర్లుగా రేవంత్, రమ్య బెహరా, అనుదీప్ దేవ్ నాయకత్వం వహిస్తారన్నారు. ఈ సీజన్ కు ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండగా, సంగీత దర్శకుడు కోటి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, పాటల రచయిత కాసర్ల శ్యామ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ అనురాధ గూడూరు మాట్లాడుతూ, యువ, అసాధారణ ప్రతిభావంతులకు ఎల్లప్పుడూ లాంచ్ ప్యాడ్ గా ఉన్న జీ తెలుగు సరిగమప సీజన్ 16ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి సీజన్ మాదిరిగానే ఈ సీజన్లోనూ ప్రతిభా వంతులైన గాయనీ, గాయకులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. ఇప్పటికే మనం చూసిన ఎనర్జీ, ప్యాషన్, టాలెంట్ చెప్పుకోదగ్గవన్నారు. తమ కల లను నిజం చేసుకోవడమే కాకుండా లక్షలాది మం దికి స్ఫూర్తినిచ్చే ఓ వేదికను అందించడమే తమ ఉద్దేశమన్నారు. ఈ సీజన్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నామంటూ ధీమా వ్యక్తం చేశారు.

అర్హులకు పింఛన్‌లు మంజూరు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర – గుత్తి/ గుంతకల్: అర్హులకు పింఛన్‌లు మంజూరు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ గోపీనాథ్ కోరారు. సీపీఐ పట్టణ కార్యాలయలో గురువారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్ పట్టణంలో పింఛన్ మంజూరు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులకు పింఛన్‌లు ఇవ్వాలన్నారు. కొంతమంది పింఛన్ దారులు అర్హులు కాదని, అలాంటి వారిని గుర్తించి తొలగించాలన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, సీపీఐ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్లు విడుదల

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలో ప్రసిద్ధ ఉరగాద్రి చౌడేశ్వరి దేవి ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు జరుగు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆలయ ధర్మకర్త కొత్త శరత్ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదీన చౌడేశ్వరి దేవి అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తుందని 4న గాయత్రి దేవిగా 5న అన్నపూర్ణేశ్వరి దేవి, 6న లలిత త్రిపుర సుందరీ దేవిగా 7న మహా చండీ దేవిగా, 8న మహాలక్ష్మి దేవిగా 9న సరస్వతి దేవిగా 10న దుర్గాదేవిగా 11న మహిషాసుర మర్దినిగా 12న దశమి శనివారం రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారని వారు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి ఆంజనేయులు, లక్క ఎర్రి స్వామి, ఆర్సీ ప్రసాద్, నిమ్మల ప్రసాద్, ఉట్టి ధనంజయ, చిట్టా రఘు, ఉట్టి నారాయణస్వామి, కొత్త శ్యామ్, చెంగలి నాగరాజు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

నాణేలను స్వీకరించేందుకు విముఖత చూపొద్దు

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: భారత ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముద్రించిన, చెలామణిలో ఉన్న నాణేలను స్వీకరించేందుకు విముఖత చూపరాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. చెలామణిలో ఉన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాణేలు విలక్షణమైన లక్షణాలను కలిగి ఉంటాయని, ప్రజల లావాదేవీల అవసరాలను తీర్చడానికి కొత్త డినామినేషన్లలో నాణేలు, వివిధ థీమ్‌లను ప్రతిబింబించేలా కొత్త డిజైన్లలో నాణేలు – ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కాలానుగుణంగా పరిచయం చేయబడతాయన్నారు. నాణేలు ఎక్కువ కాలం చెలామణిలో ఉన్నందున, వివిధ డిజైన్లు, పరిమాణాల నాణేలు ఒకే సమయంలో చలామణిలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం 1, 2, 5, 10 వివిధ పరిమాణాల నాణేలు, థీమ్, డిజైన్ చెలామణిలో ఉన్నాయన్నారు.

ఎంజేపీ స్కూల్‌కు రూ.22.50 కోట్లు మంజూరు

విశాలాంధ్ర– రాయదుర్గం: జిల్లాలో అసంపూర్తిగా నిలిచి పోయిన నాలుగు ఎంజేపీ హాస్టళ్ల నిర్మా ణాలకు సీఎం చంద్ర బాబు నాయుడు రూ.79 కోట్లు మంజూరు చేశారని, వాటిలో రూ.22.50 కోట్లు రాయదుర్గం ఎంజేపీ స్కూల్ నిర్మాణానికి వెచ్చించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖా మంత్రి సవితమ్మ తెలిపారు. గురువారం రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండల పరిధిలోని గోనబావి వద్ద తాత్కాలిక భవనంలో ఉన్న ఎంజేపీ స్కూలును రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో కలసి మంత్రి సవితమ్మ పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 107 బీసీ హాస్టళ్లలో 105 టీడీపీ ప్రభుత్వాల హయాంలో మంజూరు చేసినవేన్నారు. 2014–19లో గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రాయదుర్గంలో ఎంజేపీ స్కూల్ మంజూరుకు కృషి చేశారన్నారు. అప్పట్లో రైతులు ఉచితంగా ఆరున్నర ఎకరాలను ఇచ్చారన్నారు. అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసిందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి

విశాలాంధ్ర – జేఎన్టీయూఏ: అనంత లక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న సి.వినయ్ కుమార్‌ను ఫుట్ బాల్ అండర్ 17లో పోటీలలో ఎన్నుకోవడం పట్ల గురువారం అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎం.అనంత రాముడు, డైరెక్టర్ ఎం.రమేష్ నాయుడు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతపురం జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ఈ నెల 28న పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలలో పాల్గొని విజయ శిఖరాలను అధిరోహించాలని అన్నారు. సీఈఓ నరసింహారావు, ప్రధానోపాధ్యాయురాలు నళిన, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వేరుశనగలో ఆకుమచ్చ తెగులును నివారించండి

విశాలాంధ్ర–శింగనమల : మండల పరిధిలోనిరాచేపల్లి, ఆనందరావు పేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్ నిర్వహించారు. రైతులతో వారు సాగు చేసిన పంటల గురించి చర్చించారు. ఎరువులు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచామని, రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి అక్కమ్మ, రాచేపల్లి రైతు సేవాకేంద్రం ఎంపీఈఓ జయలక్ష్మి, మార్కెట్ యార్డ్ సిబ్బంది మహేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడిన డీసీఓని సస్పెండ్ చేసి, విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర–కూడేరు: గురుకుల పాఠశాలలో విద్యార్థులు అడ్మిషన్స్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో డిసిఓగా పని చేస్తున్న మురళీకృష్ణను సస్పెండ్ చేసి, విచారణ జరిపించాలని విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కూడేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం నుండి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నా అతనిపై ఎన్నో ఫిర్యాదులు ఉన్నతస్థాయి అధికారులకు ఇచ్చినా ఇంతవరకు ఆయన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఆడిసిఓ మరింత రెచ్చిపోయి అవకతవకులకు పాల్పడుతున్నాడన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి డిసిఓని సస్పెండ్ చేసి, ఆయన జాయిన్ అయినప్పటి నుంచి నేటి వరకు జరిగిన అడ్మిషన్లలో అవక తకులపై ఆయన పని విధానంపై విచారణ జరిపిం చాలన్నారు. సంబంధిత తల్లిదండ్రులు ప్రజాసంఘాల వారు ఎవరు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడమే కాకుండ ఆఫీస్ దగ్గరికి వెళ్లి అడిగితే సార్ ఫీల్డ్‌లో ఉన్నాడని, బిజీగా ఉన్నాడు అని, ఇలా పొంతనలేని సమాధానాలు చెపుతున్నారన్నారు. ఆయన టూర్ డైరిపై, మూమెంట్ రిజిస్టర్‌లపై విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. తక్షణమే కలెక్టర్ స్పందించి డిసిఓని సస్పెండ్ చేసి, విచారణ తర్వాత ఆయనను ఉద్యోగం నుండి రిమూవ్ చేయాలని వీహెచ్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న డిమాండ్ చేశారు.

టెక్స్ టైల్స్ పార్కు అభివృద్ధికి పెద్దపీట వేస్తాం : మంత్రి సవితమ్మ

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: పూర్తిస్థాయి మౌలిక సదుపాయలు కల్పించి రాయదుర్గం టెక్స్ టైల్స్ పార్కును అభివృద్ధి చేయనున్నామని, టెక్స్ టైల్స్ పార్కులో ఖాళీగా ఉన్న ప్లాట్లను అర్హులకు కేటాయించనున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమం, జౌళి శాఖ మంత్రి సవితమ్మ అన్నారు. గురువారం రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులుతో కలిసి రాయదుర్గం టెక్స్ టైల్స్ పార్కును మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ విలేకరు లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఎంపీగా ఉన్న సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు రెండు టెక్స్ టైల్స్ పార్కును మంజూరు చేయించారన్నారు. వాటిలో రాయదుర్గంలో ఒకటి, కానూరులో మరో పార్కును ప్రారంభించారన్నారు. రాయదుర్గంలో టెక్స్ టైల్స్ పార్కులో 2014–19 టీడీపీ ప్రభుత్వం హయాంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 55 వరకు ప్లాట్లు నిర్మించామని, వాటిలోని ఎనిమిదింటిలో వ్యాపారాలు సైతం ప్రారంభమయ్యారన్నారు. పార్కులో నూతన పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులైన పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తు న్నామన్నారు. రాయదుర్గం టెక్స్ టైల్స్ పార్కులో శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. రాయదుర్గంలో ఉన్న టెక్స్ టైల్స్ పార్కును ఎమ్మెల్యేతో కలిసి మంత్రి సవిత పరిశీలిం చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఉత్పత్తి అయ్యిన వస్త్రాలు త్వరితగతిన అమ్మకాల య్యేలా తమ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతిస్తోందన్నారు. అన్ని రకాల అనుమతులతో రాయితీలు చంద్రబాబు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీవో రాణి సుస్మిత, చేనేత, టెక్స్ టైల్స్ పార్కు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ జిమ్‌ను పునర్నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర–అనంతపురం: శిథిలావస్థకు చేరుకున్న అనంత మున్సిపల్ జిమ్‌ను పునర్నిర్మాణం చేపట్టాలని ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అనంతపురం నగరంలో ప్రభుత్వ ఉద్యోగాలైన పోలీస్ కానిస్టేబుల్, ఆర్మీ తదితర కోచింగ్‌లకు అభ్యర్థులు వేల సంఖ్యలో తీసుకుంటున్నారన్నారు. నగరానికి సంబంధించి వారి శరీరాన్ని దృఢత్వం చేసుకోవడానికి వ్యాయామం అవసరమన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ జిమ్‌లో లక్షలు విలువ చేసే సంబంధించిన పరికరాలు ప్రభుత్వ నిధులతో జిమ్ పరికరాలు మున్సిపల్ జిమ్ పేచ్చులూడి కిందపడి శిథిలావస్థకు చేరి మూతపడింది అన్నారు. గతంలో అధికారులు దృష్టికి ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకో వెళ్లినా పట్టించుకోలేదన్నారు. గతంలో నిరుపేద యువకులు వంద రూపాయల ఫీజు కడుతూ జిమ్ వ్యాయామం చేయడం జరిగిందన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు సురేంద్రబాబు, నాసిర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో చేనేత కార్మికులను ఆదుకోవాలి

విశాలాంధ్ర–రాయదుర్గం అర్బన్: పట్టణంలో చేనేత కార్మికుల సమస్యలను తీర్చాలని పట్టణ కార్యదర్శి కోట్రెష్ కోరారు. బీసీ సంక్షేమ, చేనేత శాఖ, మంత్రివర్యులు సవితమ్మకి సీపీఐ పట్టణ కార్యదర్శి కోట్రెష్ వినతి పత్రం అందజేశారు. సీపీఐ రాయదుర్గం పట్టణ కార్యదర్శి కోట్రెష్ మాట్లాడుతూ రాయదుర్గం పట్టణంలో చేనేత కార్మికుల కుటుంబాలు గతంలో 8 వేల పైచిలుకు ఉండేవన్నారు. కాలక్రమేణ చేనేత కార్మికులకు ప్రభుత్వ సహాయ సహకారాలు అందక, గతంలో ఒకపక్క పవర్లూమ్స్ వచ్చి, ఇంకోపక్క గార్మెంట్ పరిశ్రమ భారీగా విస్తరించి ప్రస్తుతం గవర్నమెంట్ పరిశ్రమ నిర్వీర్యమైందన్నారు. చేనేత కార్మికులు వారి వృత్తిని వదిలేసి ఇతర గార్మెంట్, చిరు వ్యాపారం చేసుకుంటూ, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగే పరిస్థితి దాపురించిందన్నారు. కూటమీ ప్రభుత్వమైనా చేనేత కార్మికుల స్థితిగతుల గురించి ఆలోచన చేసి వారి ఎదుగుదలకు తోడ్పాటు ఇవ్వాలని కోరారు. రాయదుర్గం మండల కార్యదర్శి దుర్గన్న, వ్యవసాయం కార్మిక తాలూకా అధ్యక్షులు నాగరాజు, ఏఐఎస్ఎఫ్ తాలూకా కోశాధికారి దినకర్, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు కుమార్ నాయక్, ఏఐఎస్ఎఫ్ తాలూకా ఉపా అధ్యక్షులు మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర–రాయదుర్గం టౌన్: రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా 8 బీసీ హాస్టల్స్ ఉన్నాయని, 6 హాస్టల్‌కి సొంతభవనాలు ఏర్పాటు చేయాలపి ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజ నేయులు అన్నారు. గురువారం మంత్రి పర్యటనలో భాగంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న మెస్ ఛార్జీలు కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని కోరారు. పాతబడిన ప్రభుత్వ హాస్టల భవనాలకు సొంత భవనాలు కేటాయించి, వాటి మరమ్మత్తుల కోసం నిధులు విడుదల చేయాలని తెలిపారు. గోనబావి గ్రామంలో అర్థాంతరంగా నిలిచిపోయిన బిసి మహిళా గురు కుల పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవితమ్మకు వినతి పత్రం అందజేస్తూ విద్యార్థిని విద్యార్థుల పరిష్కరించాలన్నారు. తాలూకా అధ్యక్షులు శశికుమార్, తాలూకా కోశాధికారి దినకర్, తాలూక ఉపాధ్యక్షులు మాధవ్, తాలూకా అధ్యక్షులు శశి కుమార్, కోశాధికారి దినకర్, ఉప అధ్యక్షులు మాధవ్‌లు పాల్గొన్నారు.

లావణ్య క్లినిక్‌ను సీజ్ చేసిన వైద్య అధికారులు

విశాలాంధ్ర–అనంతపురం: పట్టణంలోని రామచంద్ర నగర్‌లో డా.లావణ్య అను డాక్టర్ లావణ్య పాలీ క్లినిక్ పేరు మీద వైద్య సేవలు నిర్వహిస్తోంది. అనుమతులకు విరుద్ధంగా చికిత్సలు నిర్వహిస్తున్నారు. కూడేరు మండలం హంసపల్లి గ్రామానికి చెందిన వేలూరు రాధ కడుపు నొప్పితో వైద్యం కోసం వచ్చింది. అక్కడి డాక్టర్ రమణ నాయక్ హిస్టెక్టమీ ఆపరేషన్ చేయగా అది వికటించింది. దీంతో తన భర్త, బంధువులు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌కు పిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.ఈబీ దేవి ఆసుపత్రికి చేరుకొని నిజానిజాలను తెలుసుకున్నారు. ప్రాథమిక విచారణ కోసం క్లీనిక్‌ను సీజ్ చేసున్నట్లు వెల్లడించారు. తదుపరి చర్యలు కోసం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్య నిపుణుల విచారణ కమిటీ నియమించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com కర్నూలు, శుక్రవారం 27, సెప్టెంబర్ 2024

చేనేత కార్మికులకు అండగా ఉంటాం

- ప్రభుత్వం దిగి వచ్చేంతవరకు పోరాటాలు ఆగవు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి వెల్లడి

విశాలాంధ్ర-ధర్మవరం: చేనేత కార్మికులకు అండగా ఉంటామని, ప్రభుత్వం దిగి వచ్చేంతవరకు తమ పోరాటాలు ఆపమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అన్నారు. బత్తలపల్లి మండలం వేల్పుమడుగు క్రాస్ వద్దగల జేఆర్ సిల్క్స్ ఫ్యాక్టరీ వద్ద ధర్నా సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా జేఆర్ సిల్క్స్ ఫ్యాక్టరీ చేస్తున్న మోసాలను, చేనేత పరిశ్రమకు చేనేత కార్మికులకు పొట్ట కొడుతున్న వాటిని వారు చేనేత కార్మికులకు వివరించారు. అనంతరం ఫ్యాక్టరీ వద్దకు నిరసన ర్యాలీతో వెళ్లి ఫ్యాక్టరీ ప్రధాన గేటు వద్ద ధర్నాకు దిగారు. ఈ ధర్నాను ఉద్దేశించి జగదీష్, వేమయ్య యాదవులు మాట్లాడుతూ ధర్మవరం చేనేత పరిశ్రమకు తానే రాజుగా వెలుగొందాలనుకొని జెట్లూమ్స్‌ను ఏర్పాటు చేసి దిగువ, మధ్యతరగతి నేతన్నల పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు. ఈ ఫ్యాక్టరీ నిర్వాకం వల్ల పనులు లేక, చేనేత నేసిన చీరలకు గిట్టుబాటు ధరలు లేక బలవన్మరణాలకు పాల్పడే పరిస్థితి చేనేత పరిశ్రమలో ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భారీ ఎత్తున సబ్సిడీపై పరిశ్రమను ఏర్పాటు చేసి దాదాపు 200కు పైగా జెట్లూమ్స్ ఏర్పాటు చేసుకొని ప్యూర్ టూ ప్యూర్ చీరలు తయారు చేస్తూ అక్రమార్జనకు వడిగట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తూ అటు మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను, జోలి శాఖ మంత్రి సవితను అడ్డం పెట్టుకొని చేనేత కార్మికులకు కడుపు కొట్టడం ఎంతవరకు సమంజసన్నారు. జఆర్ సిల్క్ ఫ్యాక్టరీ యజమాని జింక రామాంజనేయులు స్వార్థానికి నేడు చేనేత పరిశ్రమ కుదేలు కావడం దారుణమన్నారు. అబద్ధపు మాటలతో మోసం చేస్తూ, చేనేత కార్మికుల జీవన విధానం నేడు ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. కాసులకు కక్కుర్తిపడి ఎన్ఫోర్స్మెంట్ అధికారులు జేఆర్ సిల్క్ యాజమాన్యంకు భజన చేస్తున్నారని వారు మండిపడ్డారు. చేనేత సంఘాలు, పరిశ్రమల్లోని వ్యక్తులు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఎలాంటి అక్రమాలు జరగలేదని తాపీగా చెప్పడం చూస్తుంటే ఏ స్థాయిలో ముడుపులు అందాయో అని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పు కొని బెదిరింపులకు దిగితే తాము బెదిరేది లేదని స్పష్టం చేశారు. జింక రామాంజనేయులు తన ఫ్యాక్టరీకి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతోనే ఎన్నికల ముందు బీజేపీని ఆశ్రయించారని, ఆ పార్టీ ద్వారానే చేనేత పరిశ్రమ నిర్వాహకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. 11 రకాల చేనేత వస్త్ర ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. తదుపరి నాయకులందరూ ఫ్యాక్టరీ లోపలికి వెళ్లడానికి ముఖ ద్వారం వద్ద ఉన్న గేటును దాటే ప్రయత్నించగా డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మొదటి పట్టణ సీఐ నేతృత్వంలో పోలీసులు అడ్డుకొని ,బలవంతంగా నాయకులను బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీసుల జులుం నశించాలి అన్న నినాదం ఆ ప్రాంతమంతా మారుమోగింది. ఈ కార్యక్రమంలో ధర్మవరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, మాధవస్వామి, సీపీఐ(ఎం) చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, నీలూరి రుషింగప్ప, జంగాలపల్లి పెద్దన్న, పోలా లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, వెంకటస్వామి, రమణ, ఎస్‌హెచ్ బాష, రవి కుమార్, వెంకటేష్, కుళ్లాయప్ప, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సకల రాజా తోపాటు అధిక సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయండి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-లేపాక్షి : ప్రతి జూనియర్ కళాశాలలోనూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేద విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఉదయం లేపాక్షిలోని జూనియర్ కళాశాల నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ఏఐఎస్ఎఫ్ నాయకులు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులకు ఆకలి తీర్చే మధ్యాహ్నం భోజన పథకం గత ప్రభుత్వం మధ్యలోనే ఆపి వేయడం వలన చాలామంది విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో చేరడం జరిగిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు లేక ఉన్న అవి వినియోగంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే వాటిని నిర్వహణ చేపట్టాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు నరసింహమూర్తి, నియోజకవర్గ అధ్యక్షులు దేవరాజ్, కోశాధికారి పవన్, నాయకులు వసంత్, జాయిద్ పాల్గొన్నారు.

పోస్టల్ భీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - అగళి : తపాలా శాఖలో ప్రజల సౌకర్యార్థం అమలు వరుస్తున్న పోస్టల్ భీమా సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఐపిపిబి బాలకృష్ణ లబ్ధిదారులకు తెలిపారు. మండల కేంద్రమైన అగళిలో గురువారం పోస్ట్ ఆఫీస్ సేవలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పిటిసి ఉమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమేష్ మాట్లాడుతూ ప్రజలు పోస్టల్ సేవలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ముఖ్యంగా జీఏజి పాలసీ కింద రూ.759 రూపాయలు చెల్లించి పాలసీ చేసుకున్నట్లయితే ప్రమాదవశాత్తు లబ్ధిదారులు చనిపోతే అలబ్ధిదారునికి రూ.15 లక్షల బీమా సౌకర్యం ఉంటుందని తెలి పారు. ఈ కార్యక్రమానికి ఐపిపిబి బాలకృష్ణ, ఐపిపిబి మురళి, ఎస్‌పిఎం నరేంద్ర, తపాలా సిబ్బంది రాజు, వీరభద్ర, అంజి, కృష్ణ, హనుమంత రాయుడు తదితరులు పాల్గొన్నారు.

వారి సేవా కార్యక్రమాలు అసమానమైనవి

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలు అసమానమైనవని ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంట్ మాధవి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి భజన మండలి పాత భజన మందిరం శుభదాసు సత్రం వారు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు ఉదయం పాలు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది. సేవాదాతగా వీఆర్వో బాలయ్య పెను కొండ వారు నిర్వహించడాన్ని అభినందించారు. భజన మండలి సేవకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర-పుట్టపర్తి: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని మిని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి క్లెయిమ్ సెటిల్మెంట్ కమిటీ, రోడ్ సేఫ్టీ కమిటీ సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ టీఎస్ చేత చేతన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా రవాణా అధికారి కరుణ సాగర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంబంధిత అధికారుల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలలో మరణాల సంఖ్య తగ్గించలన్నారు.ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యం, తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కదిరి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్‌ఏ అధికారి భరత్, డిఎంఅండ్‌ఓ డా.మంజువాణి, డిఇఓ మీనా, డిసిహెచ్ఓ తిపేంద్ర నాయక్, ఆర్ అండ్ బి ఎస్‌సి సంజీవరావు, పంచాయతీరాజ్ శాఖ మురళీమోహన్, ఆర్టీసీ జనరల్ మేనేజర్ మధుసూదన్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ఎన్డీయే కృషి చేస్తోంది

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్ర ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని తాడిమర్రి మండలంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌తోపాటు ఆయన పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో వంద రోజుల పాలనలో చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వాటిని పరిశీలించి పరిష్కరించే దిశలో అధికారులను ఆదేశించడం జరుగుతోందని తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసి పని చేద్దాం

విశాలాంధ్ర-పుట్టపర్తి: పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి మనమంతా కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్థానిక మున్సిపల్ ప్రజా ప్రతినిధులకు అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సత్య సాయి బాబా ఆశీస్సులతో ప్రజలు ఎన్నికల్లో మనల్ని గెలిపించారన్నారు. ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి మున్సిపాలిటీ రూపురేఖలు మార్చేం దుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని, దీనికి పార్టీలకతీతంగా అందరి సహకారం కావాలని ఎమ్మెల్యే కోరారు. కౌన్సిలర్ల అడిగిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను తీసుకు వచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన భగవాన్ శ్రీసత్య సాయి బాబా 99వ జన్మదిన వేడుకలు నవంబర్ 23న వున్నాయని భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. పుట్టపర్తిలో అనేక సమస్యలు ఉన్నాయని, దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టిందని గుర్తు చేశారు.

వరద బాధితులకు ఆర్థిక సాయమందించిన మానస నృత్య సాంస్కృతిక సంఘం గురువు

విశాలాంధ్ర-ధర్మవరం: ఇటీవల విజయవాడలో భారీగా వరదలు రావడంతో విజయవాడ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ, తినడానికి తిండి కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇల్లు లేకుండా పోవడం జరిగింది. విజయవాడ వాసులను ఆదుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛంద సంస్థలు వ్యాపారస్తులు తామున్నామంటూ వారు ముందుకు వచ్చి తమదైన శైలిలో జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు నారా లోకేష్ కు నగదు లేదా చెక్కులను అందజేస్తున్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని ఎస్బిఐ కాలనీలో గల మానస

నృత్యా సాంస్కృతిక సంఘం గురువు మానస గత కొన్ని రోజులుగా విజయవాడలో వచ్చిన వరదకు తమ వంతుగా సహాయం చేయుటకు తమ నృత్య కార్యాలయము ద్వారా ప్రజల ద్వారా భిక్షాటన చేసి, రూ.20,650 లను ఆర్డిఓ వెంకట శివరామిరెడ్డి కు చెక్కును అందజేశారు. అనంతరం మానస ఆర్డీవోను వారు ధర్మవరం డివిజన్లకు చేస్తున్న సేవలను దృష్టిలో ఉంచుకొని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇంత చిన్న వయసులో చదువుతోపాటు భారతీయ సంస్కృతి కలలను ఇనుమడింప చేసే విధంగా చిన్నారులకు నేర్పడం అభినందించేదగ్గ విషయమని, మనకళల ను మరిచిపోకుండా ఉండేందుకు భావితరాలకు అందించడం శుభదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానస తల్లిదండ్రులతో పాటు నృత్య చిన్నారి కళాకారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

విశాలాంధ్ర-ధర్మవరం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు రెండవ రోజు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ నిర్వహించడం జరిగిందని నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగేంద్ర తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో ధర్మవరం విజేతగా తాడిమర్రి రన్నర్స్‌గా, అండర్ 14 కబడ్డీ బాలుర విభాగంలో బత్తలపల్లి విజేతగా ధర్మవరం రన్నర్స్‌గా, అండర్-17 కోకో బాలుర విభాగంలో ధర్మవరం విజేతగా ముదిగుబ్బ రన్నర్స్‌గా, అండర్-14 బాడ్మింటన్ బాలికల విభాగంలో ధర్మవరం విజేతగా తాడిమర్రి విన్నర్స్‌గా నిలిచాయని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో సెలక్షన్ అయిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ రఘునాథరావు, వ్యాయామ ఉపాధ్యాయులైన నారాయణస్వామి లక్ష్మీనారాయణ మల్లేష్ లాల్ బాషా శాంత లింగం రేఖ తదితరు వ్యాయామ ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

దళిత నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని బైరేపల్లి గ్రామానికి చెందిన వైసీపీ దళిత నాయకుడు బైలప్ప తల్లి గత ఐదు రోజుల క్రితం మృతి చెందడంతో గురువారం వైకుంఠ సమారాధన జరిగింది. వైసీపీ నాయకులు గుడిబండ మాజీ జడ్పీటీసీ సభ్యులు జిబి శివకుమార్, గుడిబండ సర్పంచ్ జిబి కరుణాకర్ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్, సీనియర్ దళిత నాయకుడు బిహెచ్ రాయుడు, మండలపల్లి సర్పంచ్ అశ్వత్ ఎంపీటీసీ రామచంద్ర, స్థానిక వైసీపీ నాయకులు కరేగౌడ్, సన్నీరప్ప, రంగప్ప తదితరులు గురువారం బైలప్ప కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

క్రీడల్లో ప్రతిభ కనబరచిన ఉన్నత పాఠశాల విద్యార్థినిలు

విశాలాంధ్ర-ధర్మవరం: క్రీడల్లో పట్టణంలోని కొత్తపేటలో గల మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను ఘనపరచడం జరిగిందని హెడ్మాస్టర్ మేరీ వర కుమారి పిఈటి అశ్విని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్-14, అండర్-17, డివిజన్ స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో కబడ్డీ నందు అండర్-14లో సాయి జ్యోతిక, హిమబిందు, జోష్ణవి, వైష్ణవి, మానస రాగా అండర్-17లో కబాడ్డీలో నవ్య అశ్విత దివ్యశ్రీ లు జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-ధర్మవరం: జూనియర్ ఎన్టీఆర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు జరిగిందని అధ్యక్షులు అంకె రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని రంగా థియేటర్ వద్ద ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, మొత్తం 38 మంది రక్తదాతలు తమ రక్తాన్ని ఇవ్వడం పట్ల వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. అభి మానులు వెంకటేష్, రమేష్, నవకుమార్, ముత్యాలు, తుకారాం, చరణ్, వేణు పాల్గొన్నారు.

లేపాక్షిలో నియోజవర్గ స్థాయి స్పోర్ట్స్ పోటీలు

విశాలాంధ్ర-లేపాక్షి : మహాత్మాజ్యోతిభా పూలే ఏపి గురుకుల పాఠశాల లో శుక్రవారం నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు 100, 200, 400, 600, 800, 1500 మీటర్లు పరుగు పందెం పోటీలుతో పాటు లాంగ్జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్ పోటీలు, షాట్పుట్, డిస్కస్, జావిలిన్ పోటీలను నిర్వహించారు. స్కూల్ గేమ్సు ఫెడరేషన్ సెక్రెటరీ మొరార్జి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శివకుమార్. మూడు మండలాల నుంచీ పిఈటీలు విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరద బాధితుల కోసంవిరాళాలు

విశాలాంధ్ర-తలుపుల: విజయవాడ వరద బాధితుల కోసం తలుపుల స్థానిక మేజర్ పంచాయితీలో ఉన్న శ్రీ సాయి స్కూల్ విద్యార్థులు వారి స్వంత గ్రామాలలో విరాళాలు సేకరించారు. విద్యార్థులకు ఇప్పటి నుండే సేవాగునం అలవడాలని, పక్కవారు ఆపదలో ఉంటే ఎలా సహాయం చేయాలి అని తెలుసుకోవాలి, దాదాపుగా రూ.10 వేల విరాళంగా సేకరించారు. విద్యార్థులు చిన్న వయసునుండే సేవా కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమని స్థానిక ప్రజలు ఆ విద్యార్థులకు శ్రీ సాయి స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు

విశాలాంధ్ర-గుడిబండ: మడకశిర నియోజకవర్గం క్రీడా పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాళ్లపల్లి విద్యార్థిని విద్యార్థులు వాలీబాల్ సీనియర్ భాగంలో భార్గవి, వర్షిత, షఫీర్, రాకేష్ అలాగే జూనియర్ విభాగం లో అరుణ్, హర్షవర్ధన్, లక్ష్మీకాంత్, అజయ్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మెప్మా ఆర్పీల నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-పెనుకొండ: నగరపంచాయితీలో మెప్మా సమైఖ్యలలో పనిచేస్తున్న ఆర్పీల సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. పట్టణంలోని సాయిబాబా భజన మందిరం నందు జరిగింది. ఆర్పీలు నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు నారాయణ, అధ్యక్షులు లక్ష్మీదేవి, కార్యదర్శి సునీత లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మెప్మా ఆర్పిలో గ్రామక్య డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేయడం మహిళలకు రుణాలు ఇప్పించడం రికవరీ చేయడం ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో కీలకంగా పనిచేస్తున్న వీరికి కనీస వేతనలు, ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

విశాలాంధ్ర-రొళ్ల: ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయికి ఎంపికైన 25 మంది గురుకల విద్యార్థులు ఎంపికైనట్లు డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు. మడకశిర నియోజకవర్గ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన స్కూల్ గేమ్స్ అఫ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్, వివిధ రకాల క్రీడా పోటిల్లో అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు మండల స్థాయి నుండి దాదాపు 60 మంది క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటిల్లో పాల్గొన్నారు. అందులో 25 మంది వివిధ క్రీడాకారులు ఉన్నతమైన ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని వారు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పీడీ చంద్రశేఖర్, పీఈటీ వెంకటనారాయణ అభినందించారు.

స్వర్ణాంధ్ర 2047పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - హిందూపురం : రూరల్ పరిధిలోని కిరికిర వన్ సచివాలయం నందు గురువారం కిరికిర సర్పంచ్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో నరేంద్ర కుమార్, కిరికెర పంచాయతీ సెక్రెటరీ ఇబ్రహీం, మాజీ సర్పంచ్ రాము మాట్లాడుతూ 2047 విజన్ సాకారమవ్వాలంటే, విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాలపై అవగాహన కల్పించారు. వార్డు మెంబర్ నరేష్, వివర్స్ కాలనీ ఆంజనేయులు, బసంపల్లి రామకృష్ణ, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎముకలు, కీళ్ళ వ్యాధులకు వైద్య చికిత్సలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్ వద్ద అరగల పోతన హాస్పిటల్ నందు ఈ నెల 28న బెంగళూరు సాగర్ హాస్పిటల్ వారిచే ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎముకలు, కీళ్లకు సంబంధించిన వ్యాధులకు ప్రత్యేక వైద్య బృంధంచే వైద్య చికిత్సలను అందిస్తామని హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ గణేష్ తెలిపారు. నడుము, భుజము, మెడ, వెన్ను, మోకాళ్లు ,మెడమీ నొప్పులకు సయాటికా ఆస్టియా పోరోసిస్, కీళ్లవాతం కీళ్ల మార్పిడి మక్కి మార్పిడి తదితర వ్యాధులకు సరియైన వైద్య చికిత్సల నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వంద రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రామగిరి: టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో ఏం చేశామో ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి చెబుతున్నామని, గతంలో ఏం చేశారో అంతే ధైర్యంతో వైసీపీ నాయకులు ప్రజల్లోకి వెళ్లగలరా అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సవాల్ విసిరారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వంద రోజుల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి అనేది ఐదేళ్ల క్రితం చూశారని.. ఆ తర్వాత ఈ వంద రోజుల్లోనే చూస్తున్నారన్నారు. కనీసం చిన్న రోడ్డు

వేయాలంటే గతంలో స్పందించలేదని, వారు లేరన్నారు. ఈ ప్రభుత్వంలో అర్హత ఉంటే పథకాలు అందుతాయని, అనర్హులను కచ్చితంగా ఏర వేస్తామన్నారు. ఇప్పటికే చాలా వరకు హామీలను నెరవేర్చామని త్వరలో మిగతా పథకాలను అమలు చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు తన అనుభవంతో సమర్థవంతంగా రాష్ట్రాన్ని నడపుతుంటే వైసీపీ నాయకులు అడ్డు తగులుతూ అనేక కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రామ్మూర్తి నాయుడు బీసీ సెల్ కుంటిమద్ది రంగయ్య, టీడీపీ కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ, తెలుగు యువత లింగా శ్రీధర్, ఎంపీటీసీ శ్రీనివాసులు, కేబీ రామాంజి తదితరులు పాల్గొన్నారు.

కేతిరెడ్డి అవినీతిని వెలికి తీస్తా : మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - శ్రీ సత్యసాయి : పేద ప్రజల నుంచి అక్రమంగా సంపాదించిన కేతిరెడ్డి అవినీతిని వెలికి తీస్తామని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గురువారం తాడిమర్రి మండలం నిడిగల్లు గ్రామంలో జరిగిన మంచి ప్రభుత్వం, పొలం పిలుస్తోంది రా కార్యక్రమానికి ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జగన్ అక్రమంగా దోచుకున్న ఆస్తిని ఎక్కడ ఉన్న బయ టకు తీస్తామని, ధర్మవరంలో కీటు రెడ్డిగా అవతారమెత్తిన కేతిరెడ్డి గుర్రాల కోటను త్వరలోనే కూల్చి వేసి ఆయన తగిన బుద్ధి చెబుతామన్నారు. దౌర్జన్యాలు, రౌడీయిజం, గుండాయి జానికి చోటు లేదన్నారు. ఈ ప్రభు త్వంలో పేద, బీద బడుగు బలహీన వర్గాలకు ఎలాంటి హాని తలపెట్టద లచిన అలాంటి వారికి తగిన బుద్ధి చెబుతా మన్నారు. నియోజ =కవర్గంలో పరి టాల శ్రీరామ్, చిలకం, మధు సూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్లవేళలా ధర్మం, ప్రజలు సుఖసంతోషాలు ఉండాల న్నారు. అర్హత లేకున్నా తెచ్చుకున్న సర్టిఫికెట్లు కచ్చితంగా పరిశీలించి, దానిపై చర్యలు తీసుకుని తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై చర్యలు తప్పవన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందించేందుకు కృషి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తెలిపారు. మండల కన్వీనర్ కూచు రాము, తాడిమర్రి కేశవరెడ్డి, నాయకులు హర్ష కుమార్, బిజెపి నాయకులు గంగుల కొండ గోపాల్ రెడ్డి, బిజెపి కార్యదర్శి పోతులయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ, బత్తలపల్లి ఎంపీపీ కోటి సూర్య ప్రకాష్, ముదిగుబ్బ ఎంపీపీ గోద్దుమరి ఆదినారాయణ నిర్వహించారు.

పొలం ఖర్చులు బడిపంతుళ్లకేనా..

బడి ఒక వైపు, పిలుస్తోంది మరో వైపు
ప్రభుత్వం ఇచ్చిందా.. పక్కదారి పట్టించారా..
సతమతమవుతున్న ఆర్‌ఎస్‌కే సిబ్బంది

విశాలాంధ్ర-లేపాక్షి: రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంలో రైతుల సంక్షేమాభివృద్ధికి, కార్యక్రమాలు నిర్వహించడానికి లక్షలాది రూపాయలు వెచ్చిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో ఉన్నతాధికారులు కింద స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తారు. అయితే బడి ఒక వైపు.. పిలుస్తోంది మరో వైపు.. పొలం ఖర్చులు మాత్రం బడి పంతుళ్లకే (పొలంబడి అధికారులు) అనే విధంగా హిందూపురం వ్యవసాయ శాఖ డివిజన్లో నెలకొంది. గత మూడేళ్లగా రైతు సేవా కేంద్రాల సిబ్బంది జేబులకే చిల్లులు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఆ ఖర్చులను అందించిందా లేదా, ఆ నిధులు పక్కదారి పట్టించారా అనేది ఆందోళన కరంగా మారింది. హిందూ పురం డివిజన్లో 72 ఆర్‌ఏస్కేలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదే శాలతో 3 నెలల్లో 30 రోజులు పాటు పొలంబడి, పొలం పిలుస్తోందనే కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నారు. ఇందులో రైతులకు వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసారా పరీక్షలు, పంటల నిర్వహణ, వ్యవసాయ సలహాలను సిబ్బంది వివరిస్తారు. అయితే ఒక ఆర్‌ఎస్ కేకు ఏడాదికి రూ.16 వేల నుండి రూ.18 వేలు వరకు రైతులకు అవగాహన కార్యక్రమాలకు ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ డివిజన్లో మాత్రం ఏ ఒకరిద్దరకే తప్ప మిగిలిన 90 శాతం సిబ్బందికి ఆ డబ్బులు అందక చర్చినీయాంశంగా మారింది. ఈ కార్యక్రమాలలో ఉదయం రైతులతో సమావేశం మధ్యాహ్నం నుండి క్షేత్రస్థాయి పరిశీలన చేయిస్తున్న సిబ్బందికి ఖర్చులు అధికమవుతున్నాయి. దీంతో పాటు ఆర్‌ఏస్కేలలో పరిశుభ్రత సిబ్బంది లేక స్వంత ఖర్చులతోనే పనులు చేయించుకుంటున్నారు. దీంతో పాటు స్టేషనరీ చార్జిలు వారి జేబు నుండే కాకుండా గత మూడేళ్లలో పనుల కోసం కనీసం ట్యాబ్లు అందించక పోవడంతో స్వంత ఫోన్లలోనే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. అరకొర జీతాలతో జీవనాలు సాగిస్తున్న సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా

ఉన్నతాధికారులు స్పందించి కష్టపడి పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి నేరుగా అందేవిధంగా చర్యలు తీసుకోవాల్సి వుంది. దీనితో పాటు గత మూడేళ్లలో ఆర్‌ఏస్కేలకు వచ్చే నిదులు వచ్చాయా లేక నిదులు పక్కదారి మల్లాయా అనే కోణంలో విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 00, సెప్టెంబర్ 2024

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయల చెరువు గ్రామంలో శంకరా కంటి ఆసుపత్రి బెంగ ళూరు వారి సహకా రంతో లయన్స్, లియో క్లబ్ ఆధ్వర్యం లో లయన్స్ క్లబ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షులు చెల్లా సూర్య నారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ శిబిరానికి 70 మంది కి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 22 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా సూర్యనారాయణ మాట్లాడుతూ గత 9 నెలలుగా నిర్విరామంగా ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి, ఎంతోమంది పేద ప్రజల కంటిచూపు ఆపరేషన్లకు తమ లయన్స్ క్లబ్ చేయూతని ఇస్తుందని తెలిపారు. ఈ శిబిరమునకు విచ్చేసిన సభ్యులకు హెూటల్ నాగేంద్ర అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ లయన్ రవికుమార్ రెడ్డి,సత్యనారాయణ, రామ మోహన్ రెడ్డి, కుల సేకరణ నాయుడు, ఇస్మాయిల్, శేషానంద రెడ్డి, జయరామిరెడ్డి,అల్లా బకాష్, మురళీకృష్ణ, నిదనాడు రామకృష్ణ, లియో మంజునాథ్, సెక్రటరీ వికాస్ స్కూల్ రామకృష్ణ, లియో క్లబ్ సభ్యులు, శంకర కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర సినిమా

విశాలాంధ్ర-పెనుకొండ: కుల మతాలు అన్నీ ఒకటే అని చాటి చెప్పే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్రను సినిమాను రాయలసీమలో చిత్రీకరిస్తున్నామని రచయిత, నిర్మాత, దర్శకులు వెంకట నరసింహారాజు తెలిపారు. గురువారం పట్టణంలోని శ్రీ బాబయ్య స్వామి దర్గాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వార్థ రాజకీ యాలకు హిందూ ముస్లింలను విభజి స్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్వం అన్ని కులాలు ఒకటేనని చాటి చెప్పిన మహాను భావుడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి అన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్రపై సినిమా తీశారని, ఆయన తీసిన సన్ని వేశాలు కాకుండా ఇతర సన్నివే శాలను తీసుకొని సినిమా చిత్రీ కరిస్తున్నామన్నారు. శ్రీ వెంకట లక్ష్మి నరసింహా ప్రొడక్షన్ బ్యానర్‌పై సినిమా నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ సిని మాలో వీరబ్రహ్మేంద్ర స్వామిగా సుమన్, గోవిందమ్మగా ఇంద్రజ నటిస్తున్నారని మిగిలిన నటులను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఈ సినిమా మొత్తం రాయలసీమ లోనే చిత్రీకరిస్తామన్నారు. సినిమా చిత్రీకరణ కోసం లొకేషన్లను పరిశీలించేందుకు పెనుకొండకు వచ్చామన్నారు. 75 రోజుల్లో సినిమా పూర్తి చేసి విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, సివిల్ ఇంజనీర్ షేక్ బాబా ఫక్రోద్దీన్, జనసేన మహిళా నాయకురాలు శ్రీదేవి, సయ్యద్, అంజన రెడ్డి, హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలలో న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాటుకు కృషి చేయాలి

విశాలాంధ్ర-అనంతపురం : పీఎం పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణంలో న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాట్లు చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు చేసేందుకు జిల్లా విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, ఐసిడిఎస్, కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా అటవీశాఖ వారితో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ న్యూట్రిషన్ గార్డెన్ త్వరితగతిన ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు చేయడం వలన విద్యార్థులకు మంచి ఆహారాన్ని ఎలా పండిం చాలో, పర్యావరణంపై జ్ఞానాన్ని పెంపొందించుకొని తద్వారా పర్యావరణ సమస్యలను అధ్యయనం చేసే జీవన ప్రయోగశాలలుగాను, సేంద్రీయ పద్ధతుల పట్ల అవగాహన పెంపొందించడానికి, నేలల సంరక్షణ కోసం,స్థిరంగా జీవించడం నేర్చుకోవడానికి పర్యావరణ విద్యకు ఇది ఒక ప్రేరణగా ఉపయోగపడుతుందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఈవో వరలక్ష్మి, ఏడి నాగరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, కృషివిజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త సుధారాణి, హార్టికల్చర్ అధికారులు తదితరు సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై ప్రత్యామ్నాయ విత్తనపంపిణీ

విశాలాంధ్ర-కూడేరు: మండలంలో ఖరీఫ్ 2024 నందు వర్షాభావం వల్ల పంటలు వేయని రైతులకు బుధవారం మండల వ్యవసాయ శాఖ ద్వారా కూడేరు రైతు సేవాకేంద్రం నందు రాయితీ పై ప్రత్యామ్నాయ పంట విత్తనములైన ఉలవలు, జొన్నలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూడేరు గ్రామపంచాయతీ సర్పంచి లలితమ్మ మండల నాయకులు జయప్ప, శ్రీధర్ నాయుడు, బొమ్మయ్య, వెంకటేసులు, భీమా, శకుంతలమ్మ, వ్యవసాయ అధికారి విజయకుమార్, ఏఈఓ శైలజ, విహెచ్ఏలు, రాజకుమార్, సాజియ, గ్రామ రైతుల ఆధ్వర్యంలో ప్రారంభించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి

విశాలాంధ్ర-బొమ్మనహాల్: అడవుల సంరక్షణ, పచ్చదనం పెంపొదించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సింటైడ్ మేనేజర్ అన్వర్ అన్నారు. గురువారం బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో టీడీపీ యువ నాయకులు సోమనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటైడ్ మేనేజర్ అన్వర్ మాట్లాడుతూ ప్రజలు ప్రతి ఇంటిలో పొలాల గట్లపై మొక్కలు నాటాలని, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలన్నారు. మొక్కలు నాటి అందరిని ఆశ్చర్యపరిచేలా మొక్కలను పెంచాలన్నారు. మొక్కల పెంపకమే కాదు, వాటికి నీరు పోసి సంరక్షించాలని కోరారు. మొక్కలు పెంచడంతో వర్షాలు, పరిశుభ్రత, స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. భవిష్యత్ తరాలకు పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణం అందించినవాళ్లమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు సోమనాథ గౌడ్, ప్రధానోపాధ్యాయులు రాజ సూర్యుడు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ

విశాలాంధ్ర-ఉరవకొండ: పరిసరాల పరిశుభ్రతతోనే అనేక వ్యాధులను నియంత్రించవచ్చని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మీనుగ లలిత, గ్రామ కార్యదర్శి రమణకుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీ ద్వారా మెరుగైన పారిశుధ్య నిర్వహణ చేస్తున్నప్పటికీ ప్రజలు కూడా చైతన్యవంతులై తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిం చారు. వార్డు సభ్యులు నిరంజన్ గౌడ్, రామాంజనేయులు, వాసు, ఏఎన్ఎం సుభాషిని, ఎమ్మెల్ హెచ్ పి.మమత, వైద్య ఆరోగ్య, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన

విశాలాంధ్ర-రాప్తాడు: నియోజకవర్గంలోని రామగిరి మండలం, నసనకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ ఆదేశాల మేరకు గురువారం రామగిరి మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి నాయుడు, ముత్యాలంపల్లి రామ్మోహన్ చౌదరి, మండల తెలుగు యువత అధ్యక్షులు లింగా శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఈ శిబిరంలో కంటికి 138 మంది పరీక్షించుకోగా అందులో 75 మందికి ఆపరేషన్లు చేయించడానికి బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రికి బస్సులో తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసరి సుధాకర్, నసనకోట ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎస్సీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి డి.పోతన్న, డాక్టర్ గద్దం ముత్యాలు, గ్రామ కమిటీ అధ్యక్షులు లింగన్న, ముత్యాలంపల్లి డి.ముత్యాలు, ఉమాకాంత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాకలి ఐలమ్మ జయంతి

విశాలాంధ్ర- తాడిపత్రి: పట్టణంలోని గాంధీ సర్కిల్లో గురువారం రజక సేవా సంఘం అధ్యక్షుడు ఎల్లప్ప, అశోక్ రజక కులస్తులు తిరుపాలు, ఆనంద్ ఆధ్వర్యంలో సాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సేవా సంఘం అధ్యక్షుడు ఎల్లప్ప మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వేటిచాకిరి కోసం పోరాడిన గొప్ప యోధురాలు ఐలమ్మ అన్నారు. అంతేకాకుండా తెలంగాణలో జమీందారుల, నవాబులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప వీరవనిత అని కొనియాడారు.

యువ విజ్ఞాని డా.కె.మంజునాథ్‌కు అరుదైన గుర్తింపు

విశాలాంధ్ర-రొళ్ల: ఇటీవల అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం విడుదల చేసిన 2024 ప్రపంచంలోని టాప్ 2శాతం గొప్ప శాస్త్రవేత్తల జాబితాలో మడకశిర నియోజకవర్గం రొళ్ల మండలం అగ్రహారం గ్రామానికి చెందిన నిరుపేద రైతు కుటుంబం కృష్ణప్ప, బీరమ్మ దంపతుల కుమారుడు డా.కె.మంజునాథ్ చోటు దక్కించుకున్నారు. చిన్న వయస్సులో యువ విజ్ఞానిగా అద్భుతమైన విజయం సాధించారు డాక్టర్.మంజు నాథ్ పదవతరగతి వరకు రొళ్ల మురళి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో, ఇంటర్మీడియట్ అనంతపురం నారాయణ కాలేజీలో చదివారు. బీఎస్సీ తుమకూరు సిద్ధగంగా కాలేజీలో చదివి ఎంఎస్సి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. ప్రొఫెసర్ రామకృష్ణప్ప,ప్రొఫెసర్ గీతా బాలకృష్ణ, ప్రొఫెసర్ జి.నాగరాజు వారి మార్గదర్శకత్వంలో బెంగళూరులోని జైన్ విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పట్టా పొందారు. తరువాత బెంగుళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ సంస్థలో భారతదేశ ప్రఖ్యాత శాస్త్రవేత్త అయిన భారతరత్న ప్రొఫెసర్ సిఎన్ఆర్ రావు, ఎఫ్ఆర్ఎస్‌తో కలిసి సీనియర్ పోస్ట్ డాక్టోరల్ విద్యార్థిగా ఎన్నో పరిశోధనలు జరిపిన ఘనత ఆయన దక్కించుకున్నారు. మడకశిర తాలూకా, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు తనవంతు కృషి చేస్తానని అయన తెలిపారు.

ఇది మంచి ప్రభుత్వంపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-పెనుకొండ: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని సచివాలయం-4 పరిధిలోని దర్గా పేట తదితర కాలనీల్లో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం ప్రోగ్రాంలో కూటమి నాయకులు అస్లాం బాష, దాదు షౌకత్, సలీం, నజీర్, మహమ్మద్ బాబా ఫ్రక్రోద్దీన్, అబ్దుల్లా, బర్కత్ టౌన్ అధ్యక్షురాలు రమణమ్మ, అశ్వర్థ నారాయణ సుబ్రహ్మణ్యం, త్రివేంద్ర నాయుడు, కృష్ణమూర్తి యాదవ్ కురుబ నంజుండ, బోయ నంజుండ, చంద్ర, మురళీ, మణికంత, కురబ రామాంజనేయులు పాల్గొన్నారు.

జక్కల చెరువులో ఇది మంచి ప్రభుత్వ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుత్తి: గ్రామీణ మండల పరిధిలో జక్కలచెరువు గ్రామంలో గురువారం గుత్తి టీడీపీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి,టిడిపి నాయకులు బద్రి వలి,జక్కల చెరువు నారాయణ స్వామి,ప్రతాప్,గోవిందు మరియు ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో శివారెడ్డి, తహశీల్దార్ ఓబులేసు, ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం సంక్షోభంలోనూ సంక్షేమం అభివృద్ధికి రెక్కలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టిడిపి పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, గుంతకల్ జనసేన సమన్వయ బాధ్యుడు వాసగిరి మణికంత, గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు ఈశ్వర్, డాక్టర్ పత్తి హిమబిందు హాజరయ్యారు. ముందుగా గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కి టీడీపీ నాయకులు,కార్యకర్తలు బాణాసంచా పేల్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఐసిడిఎస్ సిడిపిఓ ధిల్లీశ్వరి ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక సీమంతల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఇది మన ప్రభుత్వకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను కూటమి ప్రభుత్వం నిలుపుకుంటూ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బిజెపి, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేద బడుగు బలహీన వర్గాలకు అండగా టీడీపీ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కణేకల్లు టౌన్: పేద బడుగు బలహీన వర్గాలకు అండగా టీడీపీ ఉంటుందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. టీడీపీ వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రగతికి ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బహిరంగ సభ జరిగింది. రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి పనులతో వంద రోజులు పూర్తి చేసుకొని ప్రజల్లోకి వచ్చామంటే అది ఎన్డీఏకే సాధ్యమైందన్నారు విజయవాడలో వచ్చిన వరదలకు చంద్రబాబు నాయుడు 10 రోజులపాటు వర్షంలో రాత్రి, పగలు పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కనేకల్ మేజర్ సర్పంచ్ పారేక్స్ నిర్మల, ఆనంద్, రాజులు, వేలూరి మరియప్ప, ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ ఫణి కుమార్, పాల్గొన్నారు.

భూ పోరాట యోధురాలు ఐలమ్మ

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని పోలీస్ స్టేషన్ సర్కిల్లో గురు వారం ఏపీ రజక వృత్తి దారుల సమాఖ్య సం ఘం పట్టణ అధ్యక్షుడు, కార్యదర్శి సాలవేముల సూరి, శ్రీరాములు ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి, 10 లక్షల ఎకరాలు భూమి పంపిణీ చేసిన గొప్ప వీరవనిత ఐలమ్మ అన్నారు. తెలంగాణలో యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ అని పేరు పెట్టారంటే అది ఎంతో గర్వకారణం అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతి కార్యక్రమాలు ప్రభుత్వమే నడపాలని రజక వృత్తి దారుల సమాఖ్య సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగ రంగయ్య, రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: కమ్యూనిస్టు ఉద్యమ నేత చాకలి ఐలమ్మ, 129వ జయంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొత్తచెరువులోని బీసీ కాలనీలో ఈమె జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాపనపల్లి శివప్ప, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రజాకారులపై తిరుగుబాటు చేసి, తన సత్తా ఏంటో చాటిందన్నారు. ఆమెను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాలు ఆమె బాటలో నడవాలన్నారు. రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, నియోజకవర్గ అధ్యక్షులు గంగాధర్, ఉపాధ్యక్షులు ఓబులేసు, మహిళా కన్వీనర్ రాధమ్మ, భారతి పాల్గొన్నారు.

కేంద్ర విద్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

విశాలాంధ్ర-గుత్తి: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమము నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయంలో బోధనా సిబ్బంది, విద్యార్థుల పర్యవేక్షణలో పరిశుభ్రత అందరి బాధ్యత, చెత్తను ఇష్టానుసారంగా పారవేయకుండా చెత్త బుట్టలలో మాత్రమే వేయడం, నేటి విద్యార్థులు భావిభారత మేధావులుగా పరిగణించి విద్యాదశ నుండే పరిశుభ్రతకు సంబంధించిన అలవాట్లను మెరుగుపరుచుకుని ఇంటిలో, చుట్టుపక్కల వారికి అవగాహన తెలియజేయుటలో విద్యార్థుకు తమ పాత్రను పోషించాలని మునిసిపల్ కమీషనర్ జబ్బార్ మియా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్ పెక్టర్ మహబూబ్ భాషా, హెల్త్ అసిస్టెంట్ నెట్టికల్లు, శానిటేషన్ సెక్రెటరీలు, స్కూల్ ప్రిన్సిపాల్, విద్యా బోధన సిబ్బంది , స్కూల్ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అమ్మకాలు, కొనుగోలు దారుల సమావేశం



విశాలాంధ్ర-రొళ్ల: అనంతపురం నగరంలోని మసీనేని గ్రాండ్ హెూటల్‌లో శనివారం అమ్మకాలు కొనుగోలు దారుల సమావేశం నిర్వహిస్తునట్లు సంజీవన్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సహదేవయ్య, హైపర్ సంస్థ రజినీకాంత్, బెన్నికట్ట రొళ్ల కామదేను ఎఫ్‌పిఓ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సిద్దరాజు తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని రొళ్ల కామధేను ఎఫ్‌పిఓ, తనకల్లు చైతన్య ఎఫ్‌పిఓ,నార్పల రైతు నేస్తం ఎఫ్‌పిఓల పరిధిలోని రైతులు పండించిన పంటలను నేరుగా ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా రైతుకు పండించిన పంటకు లాభం చేకూర్చేలా చూడాలనే ఉద్దేశంతో 3 మండలాలోని ఎఫ్‌పిఓలకు సహకారం అందిస్తున్న హెయిఫర్ ఇంటర్నేషనల్ అండర్ హెచ్ఎచ్ఎఐ-బి.ఎస్ నావజీవన్ ఆర్గనైజేషన్ తరుపున బయర్స్ సెల్లర్స్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి చాలా మంది వేరుశనగ, టమోటా, జొన్న వక్క, మిల్లెట్స్ ఇతర పంటలకు సంబందించిన బయర్స్ రాబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల ఎఫ్‌పిఓలు, బిఓడి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా దెబ్బతీసేందుకే లడ్డు వ్యవహారం

విశాలాంధ్ర-పుట్టపర్తి: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా దెబ్బతీసేందుకు లడ్డు వ్యవహారం తీసుకొచ్చారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి డిఎస్ కేశవరెడ్డి అన్నారు. గురువారం పుట్టపర్తి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దుర్బుద్ధితో భక్తులను కొంగుబంగారమైన వెంకటేశ్వర స్వామి లడ్డు తయారీలో జంతువుల కలిపారని అప హాస్యం చేస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రి టీటీడీ చైర్మన్‌ను నియమించడం వరకే ఉంటుందని, ఆయన చేసే తప్పులకు జగన్మోహన్ రెడ్డి బాధ్యుడు కాదన్నారు. పవిత్రంగా తయారు చేసే శ్రీవారి లడ్డును క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షించి లోపలికి పంపుతారన్నారు. ఉద్దేశపూర్వకంగా జగన్‌పై నిందలు వేసేందుకే లడ్డులో కొవ్వు కలిపారని ఆరోపణలు చేస్తున్నారన్నారు. జగన్మో హన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలాల్లోని దేవాలయాల్లో సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కౌన్సిలర్లు భాస్కర్ రెడ్డి, సూర్య గౌడ్, నాయకులు గంగాద్రి, నారాయణరెడ్డి, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర-రామగిరి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండల కేంద్రంలోని పరిటాల రవీంద్ర మెమోరియల్ క్రీడా మైదానంలో జరుగుతున్న ఎస్జీఎఫ్ 68వ స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి అండర్ -14, అండర్ -17 బాల బాలికల విభాగం పోటీలను గురువారం టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సునీత క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను తిలకించారు. క్రీడల కోసం అక్కడున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే క్రీడా స్ఫూర్తి ఉండాలని, బాలికలు బాలురకు ధీటుగా క్రీడల్లో మంచి విజయాలు సాధిస్తుండడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో విద్యార్థులు, క్రీడాకారుల కోసం పరిటాల రవీంద్ర పేరుతో ఇక్కడ క్రీడా మైదానం నిర్మించామన్నారు. ప్రిన్సిపాల్ అమీనా బేగం, పీడీలు చామంతి, కుమార్ రాజా, జయసింహ, మాధవరాజు, రమేష్, అంజన, కోటప్ప ఉన్నారు.

రాష్ట్రస్థాయి పుట్బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక..

విశాలాంధ్ర-లేపాక్షి : లేపాక్షిలోని నీలంసంజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో తరగతి చదువుతున్న బి.పూజిత రాష్ట్ర స్థాయి పుట్బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వివిసి గిరి, ఫిజికల్ డైరెక్టర్ సురేష్ గురవారం తెలిపారు. గుంటూరు జిల్లా వినకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పుట్బాల్ అండర్-17 విభాగంలో అనంతపురం జిల్లా తరుపున పాల్గొంటారని వారు తెలిపారు. బుధవారం అనంపురం ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో జరిగిన జిల్లా స్థాయి పుట్బాల్ పోటీల్లో ఎంపికై రాష్ట్ర స్థాయిలో పాల్గొంటుందన్నారు.

కీడా పోటీలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: క్రీడా పోటీలను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిఈటిలు రామకృష్ణ, వెంకటేశు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలోనే అండర్-14, అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు గురువారం జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. నియోజకవర్గము నుండి 400 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. గేమ్స్, కోకో, కబాడీ, వాలీబాల్, షటిల్, బ్యాట్మింటన్, యోగా, అథ్లెటిక్స్, తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఈటిలు ప్రభాకర్, రామకృష్ణ, రమేష్, ఓబులేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ సేవలో గర్భిణీలకు అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: ప్రభుత్వ వైద్యశాలకు పలు గ్రామాల నుండి వైద్య పరీక్షల కొరకు ఎంతో మంది వస్తుంటారు. గర్భిణీ స్త్రీలకు, వారి సహాయకులకు, అనారోగ్యంతో హాస్పిటల్‌కు వచ్చే వారందరికి అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. గురువారం నారాయణ సేవలో భాగంగా సుమారు 130 మందికి అన్నదాన వితరణ చేసి, అరటిపండ్లు అందజేశారు. కీర్తిశేషులు లింగమ్మ, చెన్నయ్య, అశ్వత్తయ్య, పోతయ్యల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రామాంజనమ్మ, కేశవయ్య సహకరించి సేవలో పాల్గొన్నట్లు సత్యసాయి తాలూకా సేవా సమితి అధ్యక్షులు శంకర్ తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు సత్యసాయి బాబా ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచే స్వచ్ఛత సేవలు

విశాలాంధ్ర - హిందూపురం: కేంద్ర యువజన శాఖ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు స్వభావ్ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత స్వచ్ఛతా హి సేవ లో భాగంగా, బాలయేసు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను, గడ్డి పొదలను తొలగించి, ప్లాస్టిక్ మరియు వ్యర్థ వస్తువులను ఏరివేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బస్టాండ్ గ్యాలరీలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి ఎడిసి ఓంకార మూర్తి, నాయక్, చెన్నారెడ్డిలు పరిసరాలను శుభ్రం చేస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటుతూ ఆరోగ్యకరమైన, ఆనందదాయకమైన సమాజ సేవా కార్యక్రమాలను చేస్తున్న వాలంటీర్లను అభినందించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ డా.జియావుల్లా ఖాన్, పర్యావరణ ప్రేమికుడు భాస్కర్ రెడ్డి, విద్యార్థి నాయకులు చంద్ర, ప్రోగ్రాం అధికారులు ఆశ్వర్థ నారాయణ, హరీష్, అధ్యాపకులు శివరామ రెడ్డిలు పాల్గొన్నారు.

బాపు కలల స్వప్నానికి సాకారం

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: గ్రామ స్వచ్ఛత, బాపు కలల స్వప్నాన్ని సాకారం చేద్దాం అని మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.కమల్ బాష అన్నారు. గురువారం కళాశాలలో స్వచ్ భారత్ కార్యక్రమం జెండా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రత అనేక రోగాల వ్యాప్తిని నిలువరించి ఆరోగ్య భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ చేయూతను ఇవ్వాలని కోరారు. ప్రజలను మేల్కొల్పేందుకు, చెత్త నుండి సంపద సృష్టి, నిరంతరం పరిశుభ్రత కార్యక్రమాలకు వినూత్న ఆవిష్కరణలకు ఇంజనీరింగ్ విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజేష్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విజన్ విద్యార్థులు..

విశాలాంధ్ర-యాడికి: మండలం నుండి విజన్ హైస్కూల్ విద్యార్థులు 30 మంది అథ్లెటిక్స్, చెస్, యోగా, వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో బ్యాడ్మింటన్, వంటి వివిధ క్రీడల్లో తమ ప్రతిభను మండల స్థాయిలో ప్రదర్శించి తాలూకా స్థాయి స్కూల్ గేమ్స్‌కి ఎంపిక అయ్యారు. సెప్టెంబరు 26 వ తేదీన తాడిపత్రి లో జరిగిన పోటీల్లో చెస్ విభాగంలో యాడికి మండలంకి చెందిన విజన్ హై స్కూల్ విద్యార్థులు అండర్-17 విభాగంలో ఎం.లహరి, ఎస్.దీపిక మొదటి, రెండు స్థానాల్లో గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అవ్వడంతో విజన్ ఉపాధ్యాయ బృందం విశ్వం, అమర్, శేఖర్, రాయుడులు చేశారు.